~~189309556~~

APID/ C1/Tel/ 10295

I

# ALL INDIA ESSAY WRITING EVENT- 2014

## Organized by
## Shri Ram Chandra Mission
## in collaboration with
## the United Nations Information Centre for India and Bhutan

PARTICIPANT INFORMATION SLIP

[to be filled in BLOCK LETTERS, signed by the participant, and securely attached to the essay]

Student Name: S.DIYA NISSI

Father's Name: S.David Jayananda Rao

Full Name of School/College: Good Shepherd English Medium School

Date of Birth (dd-mm-yyyy): 13-08-1999 Standard X

City/Town: Nandyal State : Andhra pradesh Phone: 9440288287

Email ID:

Category: 1 Language: Telugu

Topic : నీ పట్ల నీవు నిజాయితీగా ఉండుట అన్నింటికన్నా ముఖ్యం - షేక్స్పియర్.

**Through the submission of the Essay, the author grants and assigns all proprietary rights (including copy-right) to Shri Ram Chandra Mission. This assignment shall be deemed to be royalty-free, perpetual, worldwide and irrevocable. Shri Ram Chandra Mission may sublicense its rights through multiple tiers of sublicenses and may use, reproduce, create derivative works from, modify, publish, edit, translate, distribute, perform and display the communication or content in any media or medium, or any form, format or forum now known or hereafter developed.**

I hereby declare that I am the sole person who has written this essay. Though I am encouraged to discuss the topic with others, I hereby agree to give credit to the ideas obtained from others or any reference material.

Signature of Participant: S Diya Nissi.

Sr. Number (For official use only) ____________

# నీ పట్ల నీవు నిజాయితీగా ఉండటం అన్నిటికన్నా ముఖ్యం.

ఉపోద్ఘాతం: "లే! లేచి నిలబడు! ధైర్యంగా ఉండు! నీ భవిష్యత్తుకు నీవే బాధ్యుడవు! నీ పట్ల నీవు నిజాయితీతో వ్యవహరించి నీతో నీవు ఆనందాన్ని వెతుక్కోగలిగితే అదే ఆధ్యాత్మికత!"

మన పట్ల, ఇతరుల పట్ల నిజాయితీగా వ్యవహరించడం ఒక గొప్ప లక్షణం. ఇతరులతో మనం నిజాయితీగా ఉన్నచో మనకు సంఘం లో గొప్ప మర్యాద లభిస్తుంది. ఇతరులు మనల్ని నమ్మే విధంగా ఆ గుణం దోహదపరుస్తుంది. అందుకే చిన్నప్పటి నుండి నిజాయితీగా ఉండే స్వభావాన్ని అలవరచుకోవాలని పెద్దలు అంటారు. నీతి, నిజాయితీ అనే గుణాలు కలిగిన మనిషి ఎటువంటి క్లిష్ట పరిస్థితులనైనా ఎదుర్కోగలడు. అందుకే ప్రతి ఒక్కరు నిజాయితీగా ఉండేదుకు ప్రయత్నిస్తారు. అయితే ఇతరులతో నిజాయితీగా ఉండటం ఎంత ముఖ్యమో మన పట్ల మనం నిజాయితీగా ఉండటం అంతకన్నా ముఖ్యం. ఎందుకంటే మనపట్ల మనం నిజాయితీగా లేకపోతే మనల్ని మనమే నమ్మకపోయే పరిస్థితి ఏర్పడుతుంది. తనను తాను నమ్మలేని వ్యక్తి ఇతరులను కూడా నమ్మలేడు. కావున ఒక సంఘంలో బ్రతుకవలసిన మానవుడు తన పట్ల తాను నిజాయితీగా ఉండవలసిందే.

మనము మన పట్ల నిజాయితీ గా లేము అంటే మన మనస్సు మనమే మభ్యపెట్టుకుంటున్నాము అని అర్థము. ఒక మంచి పని సంఘ హితము కోరి చేసే పని మనం చేస్తున్నాం

అంటే ఆ సమయంలో మనము మన పట్ల నిజాయితీ తో వ్యవహరించి తీరాల్సిందే.

మనస్సు: వేరే ఏ జంతువుకు లేని ప్రత్యేకతలను దేవుడు మనలో పొందుపరిచాడు. మనం ఆలోచించగలం, మాట్లాడగలం, ఏదైనా సమాచారాన్ని అర్థం చేసుకోగలం, కవితాత్మక అంశాన్ని విశ్లేషించగలం. ఇవన్నీ దేవుడు మనకిచ్చిన ప్రత్యేకతలే! ఈ ప్రత్యేకతతో పాటు మనకు ఒక మనస్సు, మెదడు కూడా ప్రసాదించబడ్డాయి. దేవుడు చేత ప్రసాదించబడిన ఈ మనస్సు, మెదడు ఎప్పుడు మనలను మంచి చేయుమని ప్రేరేపిస్తాయి. మన పట్ల మనం నిజాయితీతో ఉండటం అంటే మన మనస్సు మనస్సు పట్ల నిజాయితీగా ఉండటమే, మన మనస్సు చెప్పే మాటలు వినడమే అవుతుంది.

మన మనస్సు చెప్పే మాటలను వినే ముందు మన మనస్సును మనం నియంత్రణలో ఉంచుకోవాలి. నియంత్రణ కలిగిన మనస్సు చెప్పే మాటలను అనుసరించడం ద్వారా మనం అద్భుతాలను సృష్టించవచ్చు. మనస్సును నిగ్రహంలో ఉంచుకోవడం అంటే, ఏది మంచి ఏది చెడు అని తెలుసుకొని మంచి మాత్రమే అవలంబించడం. కాబట్టి మన పెద్దలు మనకు చిన్నప్పటి నుండే మంచి గుణాలను నూరిపోస్తారు. గొప్ప వ్యక్తుల జీవితాలలోని సంఘటనలను మనకు కథలుగా చెబుతారు. ఈ కథలలోని భావాన్ని మనం గ్రహించి అందులోని మంచిగుణాలను అవలంబించేందుకు ప్రయత్నించాలి. అలాంటి ఒక గొప్ప వ్యక్తి మహాత్మా గాంధీజీ. ఆయన చాలా సందర్భాలలో

తన పట్ల తాను ఎంతో నిజాయితీగా, ఉండటం మనం గ్రహించవచ్చు. ఆయన తన ఆత్మకథకు "సత్యశోధన" అని పేరుపెట్టాడంటే ఆయన జీవితంలో సత్యానికి ఎంత గొప్ప విలువ ఉందని మనం అర్థం చేసుకోవచ్చు.

"ఒకసారి గాంధీజీ పాఠశాలలో ఉన్నప్పుడు పరీక్షా పత్రంలో "కెటిల్" అనే పదాన్ని తప్పు వ్రాస్తే, సదరు ఉపాధ్యాయుడు పరీక్ష జరుగుతున్న సమయంలోనే ఆ తప్పును గుర్తించి ఆ పదాన్ని సరిచేయమంటే, గాంధీజీ దాన్ని సరిచే-యడానికి నిరాకరించాడు. ఈ సందర్భంలో గాంధీజీ తన పట్ల తాను నిజాయితీగా వ్యవహరించడం మనం గమనించవచ్చు. తాను ఆ పదాన్ని తప్పు వ్రాసినప్పుడు, ఆ తప్పును తాను గుర్తించలేదు కానీ తన ఉపాధ్యాయుడు గుర్తించి దానిని సరి-చేయమని చెప్పాడు. పరీక్ష జరుగుతున్న సమయంలో తాను గుర్తించక, ఇతరులు గుర్తించి సరిచేయమని చెప్పిన తప్పును సరిచేయటం భావ్యం కాదని గాంధీగారు తలంచారు. ఈ రకమైన నిజాయితీ భావం గాంధీగారిని దేశం అంతా గర్వించేంత ఉన్నత స్థానంలో నిలబెట్టింది. ఈ నిజాయితీ గుణమే మన దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన గొప్ప సాధనం అయ్యింది.

మన మనస్సును నిగ్రహించుకోగలిగి, ఆ నిగ్రహించుకున్న మనస్సు పట్ల మనం నిజాయితీ తో వ్యవహరిస్తే మనం ఎన్నో గొప్ప కార్యాలను సాధించవచ్చు. 'ఇంద్రియ విషయములపై ఆధారపడక మనకు కావలిసిన

ఆనందాన్ని మనలోనే వెతుక్కోగలిగితే అదే ఆధ్యాత్మికత!' అని స్వామి వివేకానంద గారు చెప్పారు. ఈ ఇంద్రియ విషయములనుండి మనస్సును నిగ్రహించుకున్న వాడిని "స్థితప్రజ్ఞుడు" అంటారు. స్థితప్రజ్ఞుడైన పురుషుడు ఎల్లప్పుడు ఆత్మానందాన్ని పొందుతాడు.

ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్।
ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే॥

స్థితప్రజ్ఞుడైన పురుషుడు ఎల్లప్పుడు తన పట్ల తాను నిజాయితీతో. వ్యవహరిస్తాడు. అతడు సుఖములకు పొంగిపోడు దుఃఖాలకు క్రుంగిపోడు. తను అనుకున్న కార్యాన్ని సాధించేందుకు పరితపిస్తాడు. తన మనస్సు మాట వింటాడు.

నిజాయితీ - స్వధర్మాచరణ :- మన పట్ల మనం నిజాయితీగా ఉండకపోవటం అంటే మన ధర్మాన్ని మనం ఆచరించకపోవడం మనల్ని మనం మోసగించుకోవడం లేదా మనపట్ల మనం నిజాయితీ గా వ్యవహరించకపోవడమే అవుతుంది. "నీ ధర్మాన్ని నీవు ఆచరించు", అనేదే భగవద్గీత సారం. భగవద్గీత లోని మొదటి శ్లోకం:

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః
మమకా పాండవశ్చైవ కిమకుర్వత సంజయ॥

ఇందులోని మొదటి రెండు అక్షరాలు : ధర్మ.

భగవద్గీతలోని చివరి శ్లోకం:

యత్ర యోగేశ్వర: కృష్ణో యత్ర పార్థో ధనుర్ధర: ।
తత్ర శ్రీ ర్విజయో భూతి: ధ్రువా నీతి ర్మతి ర్మమ ॥

ఇందులోని చివరి రెండు అక్షరాలు: 'మమ' చివరి రెండు, మొదటి రెండు కలిపితే 'మమధర్మ' అవుతుంది. 'మమధర్మ' అంటే 'నీ ధర్మాన్ని నీవు ఆచరించు' అని అర్థం. ఇదే భగవద్గీత సారం. ఇదే శ్రీ కృష్ణభగవానుడు అర్జునుడికి ఉపదేశించిన సూత్రం. మన ధర్మాన్ని మనం సక్రమంగా పాటించడం ద్వారా ఒక గొప్ప జీవనశైలికి మనం ఆహ్వానం పలకడమే అవుతుంది. ఆ ఆహ్వానం మన మంచికే అని మనం గ్రహించవచ్చు. ఆ రకమైన జీవనశైలి యందు ఎల్లప్పుడు మనకు మనం నిజాయితీగా వ్యవహరిస్తాం. మనలను మనం అభివృద్ధి పథంలో పయనించేలా చేసుకుంటాం.

గొప్ప గొప్ప గ్రంథ రచయితలు, నాటకకర్తలు వారి పుస్తకాల ద్వారా, నాటకాల ద్వారా నిజాయితీ గా వ్యవహరించడం అనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నాన్ని చేశారు. వారు పుస్తకాలలో, నాటకాలలో ఆదర్శప్రాయమైన పాత్రల ద్వారా ప్రజలను మంచిమార్గంలో తమకుతాము నిజాయితీగా వ్యవహరించేలా చేయగలిగారు. ఇటువంటి సాహిత్యకారులలో మొదటి కోవకు చెందిన రచయిత "షేక్స్పియర్". అతడు వ్రాసిన నాటకాలు ముఖ్యంగా రాజవంశస్థులకు చెందిన

కథలే అయినా వారి మనోభావాలు సాధరణ ప్రజల వాటి-వలె ఉండటం చేత అన్ని రకాల ప్రజలు ఇతని నాటకాలు వీక్షి-ంచేవారు. తన నాటకాలలోని కథానాయకుల ద్వారా, పాత్రల ద్వారా వారి మధ్య సంభాషణల ద్వారా ప్రజలను నిజాయితీ అనే గుణం పట్ల ఆలోచింపచేసేవాడు.

మన ఆశయాల పట్ల నిజాయితీగా వ్యవహరించడం :

మనకు మనం నిజాయితీగా వ్యవహరించడం వల్ల మనం ఇతరులపట్ల కూడా నిజాయితీగా వ్యవహరించగలిగే వాళ్ళమవుతాము. ఇతరుల పట్ల నిజాయితీ తో వ్యవహరించినప్పుడు ఇతరులకు మనపై నమ్మకం ఏర్పడుతుంది. మన మనస్సు మాట మనం వినడం చేత మనపై మనకు నమ్మకం ఏర్పడుతుంది. సంఘజీవనంలో ఇతరులకు మనపై, మనకు ఇతరులపై, మనకు మనపై నమ్మకం ఉండటం ఎంతో అవసరం. "నిజాయితీ" ఈ సంఘాన్ని నడిపే సూత్రమని మనం చెప్పవచ్చు.

ఎందరో గొప్ప గొప్ప మహనీయులు ఒక ఆశయాన్ని గమ్యాన్ని నిర్దేశించుకుని ఆ లక్ష్యసాధనలో ఎన్ని ఆటుపోట్లు లభించినా తమ గమ్యం, ఆశయం పట్ల నిజాయితీగా వ్యవహరిస్తూ, మానవకళ్యాణమే పరమావధిగా భావించే ముందుకు సాగారు. వారిలో కొందరు:

i) రాక్‌ఫెల్లర్ : ఇతను అమెరికాకు చెందిన వ్యాపారవేత్త. ఈయన "రాక్ ఫెల్లర్ ఫౌండేషన్" అనే సంస్థను స్థాపించాడు. ఈ సంస్థ ద్వారా ఎంతో మంది పేదలకు విద్యాదానం, ఉద్యోగాలు కల్పించారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా తన లక్ష్యాన్ని విడువక తనకు తాను నిజాయితీగా ఉంటూ ఎన్నో పేరు-ప్రఖ్యాతలు సంపాదించాడు.

ii) మదర్ థెరిస్సా : ఈమె 'యుగోస్లేవియా' దేశం నుండి దీనులను ఆదుకోవాలనే గొప్ప ఉద్దేశ్యంతో భారతదేశానికి వచ్చి కలకత్తా నగరంలోని రోగస్థులను, వృద్ధులను, పేదలను, ఆర్త జనులను చేరదీసి ఒక తల్లి వలె వారిని చూసుకుంది. తాను బ్రతికున్నంత కాలం ఇతరులకు మేలు చేయాలనే లక్ష్యానికి నిజాయితీగా వ్యవహరించింది. ఆ సేవలకు గుర్తింపుగా నోబెల్ శాంతి పురస్కారం కూడా అందుకుంది.

మనం సాధించాలనుకున్న ఆశయం సర్వమానవ హితం కొరకైతే మన మనస్సు ఎప్పుడూ దాన్ని సమర్థిస్తుంది. ఒక గొప్ప ఆశయాన్ని సాధించే క్రమంలో ఎల్లప్పుడు మనకు మనం నిజాయితీతో వ్యవహరిస్తాం.

మన మనస్సును మనం చెడు అంశాలకు ఆకర్షితమవ్వకుండా నిగ్రహించుకోగలిగితే మనం ఎల్లప్పుడు లోకకళ్యాణానికై మంచి పనులు చేస్తుంటాం. ఇతరులకు మంచి చేయడంలో మన మనస్సు ఆనందంలో లీనమ-

వుతే అది స్వఅభివృద్ధికి ఒక మంచి హేతువు అవుతుంది. ఇతరులకు మంచి చేయడం మన మనస్సు చెప్పే మాట అవుతే, దాని పట్ల నిజాయితీగా వ్యవహరించడం ద్వారా ఒక నూతన యుగానికి నాంది పలికిన వారమవుతాం.

ఉపసంహారం : దేవుడు మనకు ప్రసాదించిన జ్ఞానాన్ని సరిగ్గా ఉపయోగిస్తూ మన పట్ల మనం నీతి నిజాయితీ తో వ్యవహరించడం మన లక్ష్యం కావాలి. మన పట్ల మనం నిజాయితీతో ఉండటం అంటే మనలను మనం ఎల్లప్పుడు సరిచేసుకోవడమే. మనం ఒక పనిని ప్రారంభించినప్పుడు ఆ పని మన మనస్సుకు మంచిది అన్పిస్తే ఆ పనిని కొన-సాగించడం లేదా ఆ పని మన మనస్సుకు తప్పు అన్పిస్తే ఆ పనిని విరమించడం వలన మన పట్ల మనం నిజాయితీగా ఉండేందుకు ఆస్కారం లభిస్తుంది.

మనం దేవుడిని ఒక మహోన్నత శక్తి గా భావించి, దేవుటి ఎదుట నిజాలను విన్నవించుకుంటాం. కాని ప్రతి మనిషి తనకు తాను మహోన్నతుడే. కాబట్టి మనిషి తన విషయంలో తాను నిజాయితీగా ఉండటం ఎంతైనా అవసరం.

మనకు మనం నిజాయితీగా ఉంటూ మనం అన్ని కోణాలలో అభివృద్ధి చెందుదాం. సాటి మనిషికి సహాయం చేసే గుణాన్ని పెంపొందించుకుందాం.

మనలను, ఇతరులను దైవ స్వరూపాలుగా భావించి చూద్దాం. ఇతరులతో నిజాయితీతో వ్యవహరిస్తూ "ముందడుగు వేద్దాం. భారతదేశ అభివృద్ధిలో మనము పాలు పంచుకుందాం

జై హింద్!

ఉపయుక్త గ్రంథాలు:

1) భగవద్గీత

ii) సత్యశోధన లేక ఆత్మకథ - గాంధీజీ

2) Success through PMA - Napoleon Hill & W. Clement Stone.

3) Ignited minds - Dr. A.P.J. Abdul Kalam

4) you can work your own miracles - Napolean Hill.